
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 10 : ఏప్రిల్ : 2024


కారాగారం.. నిర్మాణం భారం..
జిల్లా కేంద్రంలో జైలు లేకపోవడంతో నిందితులను రిమాండ్‌కు తరలించాలంటే దూరాభారంగా మారింది.
8లో


ఘనంగా ఉగాది
జిల్లావ్యాప్తంగా మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిపారు. ఇళ్లల్లో, ఆలయాల్లో పూజలు చేశారు.
9లో

గరిష్ఠం / కనిష్ఠం
38° / 23°
వాతావరణం
జిల్లాలో బుధవారం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

వచ్చేనెల 6నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెండు, ఆరో సెమిస్టర్ పరీక్షలు మే నెలలో నిర్వహించనున్నారు. రెండో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 24, 27 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు. ఇక ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25, 28, 30, 31, జూన్ 1, 3వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు.

కిన్నెరసానిలో 'ఉగాది' సందడి


కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో మంగళవారం సందడి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ప్రజలు డ్యామ్‌పై నుంచి జలాశయం, డీర్‌పార్క్‌లోని దుప్పులను వీక్షించారు. బోటు షికారు చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. కాగా, వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.7,700, టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.5,950 ఆదాయం లభించిందని నిర్వాహకులు తెలిపారు.

ఉగాది వేడుకల్లో రైతులకు సన్మానం


సన్మానం అందుకున్న రైతులతో ఎంపీ నామా, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఉగాది వేడుకలను కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలో చిరు ధాన్యాలు, ఇతర పంటల్లో ఉత్తమ దిగుబడులు సాధిస్తున్న 13 మంది రైతులను సన్మానించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్నేని రామారావు, గొడవర్తి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ పాల్గొని రైతులను సన్మానించి మాట్లాడారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సంఘం బాధ్యులు నల్లమోతు రఘు, మండడి నరేష్‌చౌదరి, బండి మాధవరావు, నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకులాల్లో చల్లని మజ్జిగ..

నేలకొండపల్లి: ఎండలు పెరుగుతున్న దృష్ట్యా సంక్షేమ శాఖల్లోని గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. వేడి నుంచి విద్యార్థులను సంరక్షించేందుకు సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ కార్యదర్శి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని పలు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు పూర్తికాగా, ఖమ్మంలోని అంబేద్కర్ కాలేజీలో మాత్రం ప్రత్యేక శిక్షణ కోసం విద్యార్థులు ఉన్నారు. ఈమేరకు విద్యార్థులు డీ హైడ్రేషన్‌కు గురికాకుండా గంటగంటకు బెల్ కొట్టి నీరు తాగేలా చూడాలని, మధ్యలో నిమ్మరసం ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అలాగే, ఉల్లిగడ్డ, అల్లం, జిలకర పొడి, కొత్తిమీర కలిపి చేసిన మజ్జిగ సరఫరా చేయాలని, ఉదయం 11నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యార్థులను బయటకు పంపించొద్దని, తరగతి గదులు, డైనింగ్ హాల్‌లో కుండల్లో తాగునీరు అందుబాటు ఉంచాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

- రామయ్య తిరుకల్యాణోత్సవాలు ప్రారంభం
- వేడుకగా క్రోధి నామసంవత్సరాది
- పంచాంగం వినిపించిన వేద పండితులు
- రాముడి ఆదాయం 14, వ్యయం 2

భద్రాచలం: దక్షిణ అయోధ్య భద్రగిరిలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. రానున్న శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా అర్చకులు, పండితులు అంకురార్పణ చేశారు. తొలుత ఉదయం దేవస్థానంలో మూలమూర్తుల వద్ద ఉత్సవ అనుజ్ఞ తీసుకున్నారు. అనంతరం శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామి ఉత్సవమూర్తులను బేడా మండపంలో కొలువుదీర్చారు. ఉత్సవమూర్తులకు ఉత్సవాంగ స్నపనం నిర్వహించి విశ్వక్సేనపూజ, పుణ్యావాచనం, రక్షాబంధనం జరిపి హారతి సమర్పించారు. ఆలయ ఈఓ ఎల్.రమాదేవి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆమె రామాయణ పారాయణదారులకు, ఆచార్య, బ్రహ్మ, రుత్వికులకు దీక్షావస్త్రాలను అందచేశారు. పండితులు మూలమూర్తులకు, ఉత్సవ పెరుమాళ్లకు, నిత్యకల్యాణమూర్తులకు, ఆచార్య, బ్రహ్మ, రుత్వికులకు దీక్షా కంకణధారణ చేశారు.


కల్ప వృక్ష వాహన సేవలో శ్రీసీతారామచంద్ర స్వామి వారు


కల్ప వృక్ష వాహన సేవ

ఉగాది పర్వదినం సందర్భంగా స్వామివారికి గతేడాది భక్తులు సమర్పించిన స్వర్ణ పూత కల్పవృక్ష వాహనంపై తిరువీధి సేవ జరిపారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను వాహనంపై కొలువుదీర్చి తాతగుడి సెంటర్‌లోని గోవిందరాజ స్వామి ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడ సేకరించిన పుట్ట మట్టిని మరో వాహనంపైన ఉంచి ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలతో మృత్సంగ్రహణం నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


మృత్సంగ్రహణం పూజలు చేస్తున్న అర్చకులు

రాముడి ఆదాయం 14, వ్యయం 2

దేవస్థానంలో మంగళవారం క్రోధినామ తెలుగు సంవత్సరాది వేడుకలను వైభవోపేతంగా జరిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వేపపూత పచ్చడి నివేదన చేసి భక్తులందరికీ పంచారు. సాయంత్రం బేడా మండపంలో స్థానాచార్యులు కేఈ స్థలశాయి పంచాంగ పఠనం చేయగా, భక్తులు శ్రద్ధగా ఆలకించారు. ఈ ఏడాది రాముడి ఆదాయం 14, వ్యయం 2, రాజపూజ్యం 6, అవమానం 6 అని తెలిపారు. సీతమ్మవారి ఆదాయం 5, వ్యయం 5 అని, రాజపూజ్యం 5, అవమానం 2 అని పేర్కొన్నారు. జ్యేష్ఠమాసం శుక్లపక్షంలో తొలకరులు ఉంటాయని, సస్య వృద్ధి ఉంటుందని వెల్లడించారు.


పంచాంగ పఠనం చేస్తున్న స్థానాచార్యులు

పటిష్ట నిఘా..

- జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు
- గంజాయి, మద్యం బాటిళ్ల స్వాధీనం
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ చర్యలు
- ఇప్పటివరకు 164 కేసులు నమోదు

కొత్తగూడెంఅర్బన్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో మద్యం, మత్తు పదార్థాలు, గంజాయి రవాణాపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు గట్టి నిఘా పెట్టారు. విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. మద్యం, గంజాయి, మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించి మద్యం రవాణా చేసిన ఘటనల్లో ఇప్పటివరకు 164 కేసులు నమోదు చేశారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఇప్పటినుంచే రాజకీయ నాయకులు, వారి అనుచరులు మద్యం డంప్‌లు ఏర్పాటు చేసే అవకాశం ఉండగా, ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఓటరు ప్రలోభాలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

అధిక కొనుగోళ్లపై దృష్టి..

జిల్లాలోని ఆరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట, భద్రాచలం ఏరియాల పరిధిలో మొత్తం 88 వైన్ షాపులు, 13 బార్ షాపులున్నాయి. కాగా అనధికారికంగా సాగుతున్న బెల్టు షాపులపై అధికారులు దాడులు చేస్తున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసులు పెడుతున్నారు. చెక్ పోస్టుల వద్ద క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రూట్‌వాచ్‌లు చేపడుతున్నారు. ఎక్కువ మొత్తంలో మద్యం కొనుగోలు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు.

గంజాయి స్వాధీనం..

కొత్తగూడెం డివిజన్ పరిధిలో గత జనవరి నుంచి ఇప్పటివరకు పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు తరలిస్తుండగా నిందితులను పట్టుకుని, రిమాండ్‌కు తరలిస్తున్న ఘటనలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేస్తూ గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నారు. వాహనాలను సీజ్ చేస్తున్నారు. సరైన వివరాలు చూపకుండా తరలిస్తున్న రూ.6,91,000 నగదును సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలు, గంజాయి, ధ్వంసం చేసిన నాటుసారా, బెల్లంపానకం మొత్తం విలువ రూ.25,07,513 ఉంటుందని, 164 మందిపై కేసులు నమోదు చేశామని, 131 మందిని అరెస్ట్ చేశామని జిల్లా ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.


బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న కొత్తగూడెం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది (ఫైల్)

కొన్ని కేసులు వివరాలు..

- గత నెల 18న దుమ్ముగూడెం మండలం సుజ్ఞానపురం గ్రామానికి చెందిన అజ్మీరా రవి 60 లీటర్ల నాటుసారా తీసుకొని అర్లగూడెం మార్గంలో వెళ్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.
- గత నెల 19న అశ్వాపురం మండలం గొల్లగూడెంలోని సీతారామ ప్రాజెక్టు కెనాల్ వంతెన వద్ద పోలీసుల తనిఖీలు చేపట్టి కారులో మహారాష్ట్రకు తరలిస్తున్న 138 కిలోల గంజాయి పట్టుకున్నారు.
- 22న పాల్వంచ పట్టణంలోని హమాలీకాలనీ, ఇందిరానగర్‌కాలనీల్లో రెండు బెల్ట్ షాపుల్లో రూ.8 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.
- గత నెలలో ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 66 కిలోల గంజాయిని భద్రాచలంలో పట్టుకున్నారు.
- కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 12 లీటర్ల నాటుసారా, 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు.

మద్యం డంప్‌లపైనా దృష్టి సారించాం



ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ప్రతి చెక్ పోస్టు వద్ద ఎక్సైజ్ పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. మద్యం డంప్‌లపై కూడా దృష్టి సారించాం. సారా, గంజాయి రవాణా చేస్తే పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఎక్సైజ్ శాఖ పరిధిలో తగిన చర్యలు చేపడుతున్నాం.

–జానయ్య, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పాల్వంచరూరల్: తొమ్మిది రోజులపాటు జరగనున్న శ్రీదేవి వసంత నవరాత్రి ఉత్సవాలు ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో ఉత్సవాలను ఆలయ ఈఓ జి.సుదర్శన్ దంపతులు ప్రారంభించారు. ఆలయం చుట్టూ మామిడి తోరణాలతో అలంకరించగా, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఆలయ ప్రదక్షిణలు, కలశ పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు గణపతిపూజ, పుణ్యాహచనం, పంచగవ్యప్రాసన, రుత్వికరణ, దీక్షావస్త్రధారణ, అఖండ దీపారాధన, మంటపారాధన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేం, లక్ష కుంకుమార్చన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం తదితర పూజలు జరిపారు. తొలి సంవత్సరాదిని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

దాతల ఆందోళన

ప్రారంభోత్సవానికి ప్రతి సంవత్సరం అమ్మవారికి విరాళాలు అందజేసిన దాతలను ఆహ్వానిస్తారు. కానీ అధికారులు ఈసారి ఆహ్వానం పంపలేదు. దీంతో పాల్వంచ, కొత్తగూడేనికి చెందిన పలువురు దాతలు ఆలయం వద్దకు చేరుకుని ఈఓతో వాగ్వాదానికి దిగారు. కాగా ఆహ్వాన బాధ్యతలను జూనియర్ అసిస్టెంట్ నర్సింహారావుకు అప్పగించానని, విచారణ చేస్తానని ఈఓ పేర్కొన్నారు.

జమలాపురంలో..

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలుత అర్చకులు శ్రీవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి.. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించారు. స్వామికి వేపపూవు ప్రసాదాన్ని నివేదించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు పూజలు చేశారు.

ఎల్‌డబ్ల్యూఈ పనులకు గ్రీన్ సిగ్నల్

- జిల్లాలో రూ.37.75 కోట్ల పనులకు అటవీశాఖ అనుమతి
- గతంలో అభ్యంతరం తెలపగా అసంపూర్తిగా నిలిచిన పనులు

ఇల్లెందు: గత ప్రభుత్వంలో అనుమతులు రాక నిలిచిపోయిన రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు అనుమతులు లభించాయి. జిల్లాలో ఎల్‌డబ్ల్యూఈ నిధులు రూ. 37.75 కోట్లతో చేపట్టిన పనులకు అటవీ శాఖ అభ్యంతరం తెలిపింది. మొత్తం పది పనులు ఉండగా, ఇందులో చర్ల మండలంలో 8, దుమ్ముగూడెం, ఆళ్లపల్లి మండలాల్లో ఒక్కోటి చొప్పున ఉన్నాయి. పనులు అసంపూర్తిగా నిలిచిపోగా, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలో పర్యటించిన సందర్భంలో సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి చొరవతో ఆయా పనులకు అటవీశాఖ నుంచి అనుమతులు వచ్చాయి.

అనుమతులు లభించిన పనులు ఇవే

చర్ల మండలంలో రూ.2.18 కోట్లతో పూసుగుప్ప రోడ్ పనులు చేపట్టగా, అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయి. రూ.98.10 లక్షలతో చేపట్టిన కొయ్యూరు – క్రాంతిపురం బీటీ రోడ్, రూ.80.96 లక్షలతో చేపట్టిన అంజనాపురం – తిమ్మిరిగూడెం బీటీ రోడ్, రూ.1.19 కోట్లతో చేపట్టిన గీసరెల్లి–కిష్టారంపాడు బీటీ రోడ్, రూ.2.02 కోట్లతో చేపట్టిన బత్తినపల్లి–ఆర్‌సీ పురం రోడ్, రూ.2.07 కోట్లతో ప్రారంభించిన లెనిన్ కాలనీ– కందిపాడు బీటీ రోడ్, రూ.3.02 కోట్లతో చేపట్టిన గోవిందాపురం – బక్కచింతలపాడు బీటీ రోడ్, రూ.1.67 కోట్లతో నిర్మిస్తున్న కొయ్యూరు – క్రాంతిపురం హైలెవల్ బ్రిడ్జి– రోడ్, రూ.1.67 కోట్లతో చేపట్టిన లెనిన్ కాలనీ – కందిపాడు హైలెవల్ బ్రిడ్జి పనులు నిలిచిపోగా, తాజాగా అనుమతులు వచ్చాయి. దుమ్ముగూడెం మండలంలో రూ.1.59 కోట్లతో చేపట్టిన కొత్తపల్లి మొయిన్ – గద్దెమడుగు హైలెవల్ బ్రిడ్జి, రోడ్, చర్ల మండలంలో రూ.2.06 కోట్లతో చేపట్టిన దేవరపల్లి–కరకటపాడు హైలెవల్ బ్రిడ్జి, రోడ్ నిర్మాణం, రూ.2.05 కోట్లతో చేపట్టిన దేవరపల్లి–కరకటపాడు హైలెవల్ బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం, రూ.1.70 కోట్లతో చేపట్టిన దేవరపల్లి – కరకటపాడు హైలెవల్ బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం, రూ.1.35 కోట్లతో ప్రారంభించిన కరకటపాడు – బక్క చింతలపాడు హైలెవల్ బ్రిడ్జి, రోడ్ నిర్మాణం, రూ.1.62 కోట్లతో చేపట్టిన గీసరెల్లి –కిష్టారంపాడు హైలెవల్ బ్రిడ్జి, రోడ్డు, రూ. 2.55 కోట్లతో చేపట్టిన బత్తెనపల్లి – ఆర్‌సీపురం హైలెవల్ బ్రిడ్జి, రోడ్డు, ఆళ్లపల్లి మండలం భట్టుపల్లి – మామకన్ను రోడ్‌లో కిన్నెరసాని నది మీద రూ.9.19 కోట్లతో చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి, రోడ్ పనులకు కూడా అనుమతులు లభించాయి. దీంతో ఇక రోడ్లు, బ్రిడ్జి నిర్మాణ పనులు చకాచకా పూర్తికానున్నాయి.


అనుమతి లభించిన చర్ల మండలం లెనిన్ కాలనీ- కందిపాడు బీటీ రోడ్డు

కిన్నెరసానిపై బ్రిడ్జి నిర్మాణానికి 20 ఏళ్లుగా ఆటంకాలు

కిన్నెరసాని నదిపై మీద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా, 1 నుంచి 5 పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. 6 నుంచి 8 పిల్లర్లకు పనులకు అటవీశాఖ అభ్యంతరం తెలిపింది. కిన్నెరసాని–జల్లేరు సంగమంలో ఆళ్లపల్లి–మామకన్ను రోడ్ మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి 20 ఏళ్లుగా ఆటంకాలు ఎదురవుతున్నాయి. 15 దఫాలుగా టెండర్లకే పరిమితమైంది. అయితే మంత్రి తుమ్మల చొరవతో ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తికానుంది.

ఉక్కపోతతో విలవిల

- జిల్లా ప్రభుత్వాస్పత్రి, ఎంసీహెచ్‌లో సక్రమంగా పనిచేయని ఫ్యాన్లు
- పెరుగుతున్న ఎండలతో రోగులు, బాలింతలు, శిశువులకు అవస్థ

కొత్తగూడెంరూరల్: రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ప్రస్తుత వేసవిలో కూడా రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. 15 రోజుల నుంచి ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది. ఉక్కపోతకు తట్టుకోలేక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న రోగులు విలవిల్లాడుతున్నారు. కూలర్లు, ఏసీలు అసలే లేవు. ఫ్యాన్లు సక్రమంగా పనిచేయడంలేదు. దీంతో రోగులు బెడ్ల మీద పడుకోలేక బయటకు రాలేక అవస్థ పడుతున్నారు.

ఎంసీహెచ్‌లో 160 బెడ్లు

జిల్లా కేంద్రంలోని రామవరం మాతా శిశు సంక్షణ కేంద్రంలో 100 బెడ్లు ఉన్నాయి. ఇక్కడికి వెంకటాపురం, వాజేడు, ఇల్లెందు, వేలేరుపాడు, అశ్వారావుపేట, గుండాల తదితర ప్రాంతాలతోపాటు, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి అనేక మంది గర్భిణులు వైద్యం కోసం వస్తున్నారు. నిత్యం 300 పైగా ఓపీ ఉంటుంది. ప్రతి నెలా 200 నుంచి 300 వరకు కాన్పులు జరుగుతున్నాయి. ఆస్పత్రిలో చికిత్స పొందే బాలింతలు, గర్భిణులు, చిన్నారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో బెడ్ల సంఖ్యను 100 నుంచి 160కు పెంచారు.

పిల్లల వార్డులోనూ పనిచేయని ఏసీలు

ఎంసీహెచ్‌లో పిల్లలకు వైద్యం అందించేందుకు ప్రత్యేకంగా వార్డు ఉంది. ఇందులో కూడా ఏసీలు పని చేయటంలేదు. కనీసం కూలర్లు కూడా ఏర్పాటు చేయలేదు. జిల్లాలోని సర్వజన ఆస్పత్రి, ఎంసీహెచ్‌కు ఉన్న ఏసీలు పని చేయటంలేదు. అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా ఆస్పత్రి వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఉక్కపోత భరించలేక బాలింతలు, చిన్నారులు, సాధారణ రోగులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దీనికితోడు జిల్లాలో 40 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వేడి ఎక్కువగా ఉండటంతోపాటు వడ గాలులు సైతం వీస్తున్నాయి.

ఎంసీహెచ్‌లో 266 కాన్పులు

ఎంసీహెచ్‌లో గత నెలలో 266 కాన్పులు నిర్వహించగా, అందులో 147 సిజేరియన్లు చేశారు. పిల్లలకు 42 బెడ్‌లు ఉండగా, ఇందులో నవజాత శిశువులకు 20 కేటాయించారు. ప్రసుతం అదనంగా మరో 20 పడకలు ఏర్పాటు చేశారు. ఎంసీహెచ్‌లో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నా కూలర్లు, ఏసీలు లేకపోవడంతో బాలింతలు, నవజాత శిశువులు ఉక్కపోతకు గురవుతున్నారు. కలెక్టర్ ప్రియాంక ఆల స్పందించి జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో ఏసీలు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



ఎంసీహెచ్‌లో ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న బాలింతలు

శస్త్రచికిత్స చేయించుకున్న వారికి మరింత అవస్థ

జిల్లా సర్వజన ఆస్పత్రిలో 220 బెడ్లు ఉన్నాయి. వివిధ సమస్యలతో సర్జరీ చేయించుకున్నవారు ఎండ వేడిమితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒకవైపు మందులు వాడితే శరీరంలో వేడి ఎక్కువ అవటంతోపాటు కనీసం కూలర్ కూడా లేకపోవడంతో పేషెంట్లు బెడ్లపై పడుకోలేకపోతున్నారు. ఇక్కడ కూడా ఫ్యాన్లు, కూలర్లు లేవు.

రూ. 2.40 కోట్లకు కుచ్చుటోపీ

- ఎఫ్‌డీల నగదు సొంత ఖాతాలోకి మళ్లింపు
- ఖమ్మంలో ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్ నిర్వాకం



ఖమ్మంక్రైం: ఖమ్మంలో ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఖాతాదారులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన నగదు రూ.2.40కోట్ల మేర మేనేజర్ తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్నాడు. ఇప్పటివరకు కొందరు బాధితులు బయటకు రాగా.. అందరి వివరాలు తెలిస్తే ఈ వ్యవహారం రూ.5కోట్ల వరకు చేరే అవకాశముందని తెలుస్తోంది. ఈమేరకు మేనేజర్‌పై బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలు... ఖమ్మంకు చెందిన పలువురు తమ పిల్లలను విదేశాల్లో చదివించేందుకు గాను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ బ్యాంకు నుంచి రూ.5కోట్లకు పైగా రుణాలు తీసుకున్నారు. అయితే, ఈ నగదును ఒకేసారి పంపించకుండా ఖాతాల్లోనే ఉంచి (ఫిక్స్‌డ్ డిపాజిట్) నిబంధనల మేరకు కొంత మొత్తం చొప్పున పంపిస్తున్నారు. ఈక్రమంలోనే సదరు బ్యాంకు మేనేజర్ కొంగర రామకృష్ణ వారి ఖాతాల్లోని నగదును తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించుకున్నారు. తాజాగా ఈ వ్యవహారం బయట పడడంతో 13మంది ఖాతాదారులు మేనేజర్ రామకృష్ణను నిలదీయడంతో ముఖం చాటేశాడు. అంతేకాకుండా కోర్టులో ఐపీ పెట్టే అవకాశముందని తెలియడంతో బాధితులు పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌కు సోమవారం ఫిర్యాదు చేయడంతో ఆయన సూచనల మేరకు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం రామకృష్ణపై చీటింగ్ కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం కొందరు బాధితులకు సంబంధించి రూ.2.40కోట్ల వ్యవహారం బయటపడగా.. అందరూ బయటకు వస్తే రామకృష్ణ మళ్లించుకున్న నగదు రూ.5కోట్ల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. రామకృష్ణ స్వస్థలమైన కామేపల్లి మండలం ఊట్కూరుతో పాటు ఆయన స్నేహితులు, బంధువులను సైతం పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

నేటి నుంచి రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెంనకు చెందిన రక్షణగిరి పుణ్యక్షేత్రం యూత్ ఆధ్వర్యాన అంబేడ్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న జట్ల బాధ్యులు ఎంట్రీ ఫీజుగా రూ.800 చెల్లించాలని పేర్కొన్నారు. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులు అందించడమే కాకుండా క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 80080 44231, 82974 75642, 76758 56515 నంబర్లల్లో సంప్రందించాలని సూచించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కామేపల్లి: ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారి పక్కన ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టగా ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఇల్లెందు పట్టణానికి చెందిన మల్సూర్ మంగళవారం తెల్లవారుజామున బైక్‌పై ఖమ్మం వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో కామేపల్లి మండలం పండితాపురం సంత సమీపాన రోడ్డు పక్కన నిలిచిన లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో మల్సూర్ తలకు తీవ్ర గాయం కాగా, చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురిపై హత్య కేసు నమోదు

అశ్వాపురం: దాడికి పాల్పడిన ముగ్గురిపై అశ్వాపురం పోలీసులు మంగళవారం హత్య కేసు నమోదు చేశారు. పాత కక్షల నేపథ్యాన అశ్వాపురానికి చెందిన వ్యక్తిపై మొండికుంటకు చెందిన ముగ్గురు వ్యక్తులు సోమవారం రాత్రి దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితుడి ఫిర్యాదుతో ముగ్గురిపై హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

జూదరులు అరెస్ట్

అశ్వారావుపేట (ములకలపల్లి): కోడిపందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రాజమౌళి కథనం మేరకు.. మండలంలోని పాతగంగారం సమీపంలోని వాగొడ్డుగుంపు గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి రూ.1,600 నగదు, ఆరు కోడి పుంజులు, 11 ద్విచక్ర వాహనాలు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉల్లిగడ్డల లారీ బోల్తా..

- భగీరథ పైప్‌లైన్ పగలడంతో నిలిచిన తాగునీటి సరఫరా



లారీ బోల్తా పడడంతో పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని రామకృష్ణాపురం వద్ద మంగళవారం సాయంత్రం ఉల్లిగడ్డల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. మహారాష్ట్ర నుంచి ఒడిశా వెళ్తున్న లారీ బోల్తా పడగా సుమారు 15 టన్నుల ఉల్లిగడ్డలు చెల్లాచెదురుగా పడిపోయాయి. అయితే, లారీ రోడ్డు పక్కనే ఉన్న మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌పై పడడంతో పైపులు పగిలిపోయి భారీగా నీరు వృథా అయింది. ఈ కారణంగా పెనుబల్లి, వేంసూరు మండలాలకు నీటి సరఫరా నిలిపివేశారు. పైప్‌లైన్ మరమ్మతులు పూర్తయితే బుధవారం మధ్యాహ్నం నుంచి తాగునీరు సరఫరా చేసే అవకాశముందని తెలుస్తోంది. ప్రమాద సమయంలో లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడా లేక మద్యం సేవించాడా అనేది తెలియాల్సి ఉంది. ఘటన సమాచారం తెలిసిన కల్లూరు ఎస్సై షాకీర్ సిబ్బందితో చేరుకుని రెండు క్రేన్ల సాయంతో లారీని బయటకు తీయించారు.

కారాగారం.. నిర్మాణం భారం..



ఖమ్మంలోని జిల్లా జైల్

- జైలు ఏర్పాటుకు కొత్తగూడెం బోడిగుట్ట వద్ద 10 ఎకరాలు కేటాయింపు..
- నిర్మాణం విషయంలో ఒక్క అడుగూ పడని వైనం..
- రిమాండ్ ఖైదీలను భద్రాచలం, ఇల్లెందు లేదా ఖమ్మం తరలించాల్సిందే..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం కోర్టుకు వచ్చే, పలు కేసుల్లోని నిందితులను రిమాండ్ నిమిత్తం తరలించాలంటే భద్రాచలం లేదా ఇల్లెందు లేదా ఖమ్మం జైళ్లకు పంపించాలి. ఇలా ఎటు తరలించాలన్నా దూర భారంతోపాటు సెక్యూరిటీ పరంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కొత్తగూడెంలోనే జైలు నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుందని పలువురు చెబుతున్నారు. అయితే, కొత్తగూడెం బోడిగుట్ట సమీపంలో జిల్లా జైలు ఏర్పాటుకు ప్రభుత్వం 10 ఎకరాల స్థలం కేటాయించినా నిర్మాణం కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. జిల్లాలో 28 పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు వివిధ కేసుల విచారణ నిమిత్తం కోర్టులకు నిందితులను తీసుకొస్తారు. వారిని రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించాల్సి ఉంటుంది.

దూరా భారం..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి జైలు ఏర్పాటు చేసేందుకు చొరవచూపడం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దాదాపుగా 14 కోర్టుల ద్వారా న్యాయసేవలు అందిస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత నూతన జిల్లాల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఏర్పాటు చేసినప్పటికీ జైలును మాత్రం ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. దీంతో రిమాండ్ నిమిత్తం నిందితులను ఇల్లెందు లేదా భద్రాచలం లేదా ఖమ్మంకు తరలించాల్సిందే. ఇది దూరభారంతోపాటు నిందితులను తరలించడం పోలీసులకు సవాల్‌గా మారింది. కొత్తగూడెం నుంచి భద్రాచలానికి దాదాపు 42 కిలోమీటర్లు, ఇల్లెందు 30 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇక ఖమ్మం తరలించాలంటే 80 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఈ సమయంలో నిందితులు పారిపోతే పోలీసులకు ఇక్కట్లు తప్పవు. జిల్లా కేంద్రంలోనే జైలు ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని పలువురు పేర్కొంటున్నారు.

జిల్లాలో 14 కోర్టులు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దాదాపుగా 14 కోర్టులు ఉండగా అందులో జిల్లా కేంద్రం కొత్తగూడెంలోనే 10 కోర్టులున్నాయి. జిల్లా జడ్జి (డిస్ట్రిక్ కోర్టు) -1, జిల్లా అదనపు కోర్టు (అడిషనల్ డిస్ట్రిక్ కోర్టు) -1, అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ పోక్సో కోర్టు-1, ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు-1, అసిస్టెంట్ అడిషనల్ సెషన్స్ జడ్జి కోర్టు-1, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు-1 జ్యుడీషియల్ సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ కోర్టు-1, జ్యుడీషియల్ థర్డ్ అడిషనల్ మెజిస్ట్రేట్ కోర్టు-1, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు-1 జువెనైల్ కోర్టు-1ను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. భద్రాచలంలో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు-1, అసిస్టెంట్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు-1, ఇల్లెందులో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు-1, మణుగురులో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు-1, దమ్మపేటలో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు-1 ఉన్నాయి. ఆయా కోర్టులకు విచారణ నిమిత్తం తీసుకొచ్చేవారిని రిమాండ్‌కు తరలించేందుకు ఇతర ప్రాంతాలకు తరలించాల్సిందే.

కొత్తగూడెంలో జైలు ఏర్పాటు చేయాలి



కొత్తగూడెంలో జైలును ఏర్పాటు చేయాలి. గతంలో బోడిగుట్ట వద్ద 10 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. జిల్లావ్యాప్తంగా కోర్టుల నుంచి విచారణ కోసం వచ్చిన వారిని రిమాండ్‌కు తరలించాలంటే భద్రాచలం లేదా ఇల్లెందు లేదా ఖమ్మంకు వెళ్లాలి. దూర భారం, సమయం, రక్షణ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

–లక్కినేని సత్యనారాయణ, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు



ప్రకాష్‌ను సన్మానిస్తున్న వివిధ ప్రాంతాల మత గురువులు

వేడుకగా బిషప్ అభిషేక మహోత్సవం

- ఖమ్మం బిషప్‌గా సగిలి ప్రకాశ్
- హాజరైన వివిధ రాష్ట్రాల పీఠాధిపతులు, మత గురువులు



బిషప్ ప్రకాష్‌ను అభిషేకిస్తున్న కార్డినల్ ఆంథోని

ఖమ్మంరూరల్: ఏపీలోని కడప పీఠానికి చెందిన గురువు సగిలి ప్రకాష్‌కు ఖమ్మం నూతన పీఠాధిపతిగా మంగళవారం అభిషేకం చేశారు. ఖమ్మం రూరల్ మండలంలోని కరుణగిరి చర్చిలో ప్రకాష్‌కు అభిషేక మహోత్సవం ఘనంగా జరిగింది. హైదరాబాద్ అగ్రపీఠాధిపతి, కార్డినల్ ఆర్చ్ బిషప్ పూల ఆంథోనితో పాటు కడప పీఠం పాలనాధికారి బిషప్ గాలి బాలి, వరంగల్ పీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాల ఆధ్వర్యాన అభిషేక మహోత్సవం నిర్వహించారు. ఈవేడుకలో భారత దేశ పోప్ ప్రతినిధి జాయింట్ జస్టిస్ లాటిన్ ప్రమాణ పత్రాన్ని అందజేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రకాష్ మాట్లాడుతూ లోక రక్షకుడైన ఏసుప్రభు మార్గం అందరికీ శిరోధార్యమని తెలిపారు. జగద్గురువు పోప్ ప్రావిన్స్ తనపై ఉంచిన దైవ కార్యాన్ని పునీతంగా నిర్వహిస్తానని చెప్పారు. హైదరాబాద్, కడప, వరంగల్, తిరుపతి, చిత్తూరు, విజయవాడ, గుంటూరు, తమిళనాడుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మత గురువులు, సిస్టర్లు, కన్యస్త్రీలు హాజరుకాగా.. తొలుత బిషప్ ప్రకాశ్‌ను ఊరేగింపుగా చర్చికి తీసుకొచ్చారు. బిషప్‌లు జోసెఫ్ రాజారావు, పొలిమేర జయరావు, రాయిరా విజయ్‌కుమార్, మల్లవరపు ప్రకాష్, మైపన్‌పాల్, జస్టిన్ ప్రకాష్, గోవింద్ జోజి, తుమ్మా బాల, అమృతస్వామి, ఇన్నయ్య, బాగ్గేయ, దమన్ కుమార్, మాథ్యూ వరప్రసాద్‌రాజు, తప్పెట గౌరి, పరసాల సుధాకర్, మేడికొండ స్లీప్‌అప్ప, దామళ్ల సురేష్, కనపర్తి ప్రకాష్, పసుపులేటి సురేష్, కొమ్ము ఆంటోని తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించాడని యువకుడి ఇంటి ఎదుట ధర్నా

నేలకొండపల్లి: మూడేళ్ల పాటు ప్రేమించుకున్నాక పెళ్లికి నిరాకరించిన యువకుడి ఇంటి ఎదుట యువతి మంగళవారం ధర్నాకు దిగింది. మండలంలోని గువ్వలగూడెంకు చెందిన కె.రాము అదే గ్రామానికి చెందిన యువతి సామాజిక వర్గం ఒకటే కాగా, మూడేళ్ల నుంచి ప్రేమించుకుంటున్నారు. రాము బీటెక్ పూర్తికాగా, యువతి బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. అయితే, పెళ్లి ప్రస్తావన తీసుకురాగానే యువకుడు తన తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని ముఖం చాటేశాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె గత గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా విషయం కుటుంబీకులకు తెలిసింది. ఆమెకు చికిత్స చేయించాక మంగళవారం యువకుడి ఇంటికి వెళ్తే అప్పటికే ఆయన వెళ్లిపోయాడు. దీంతో తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని ఆమె ఇంటి ఎదుట బైఠాయించింది. అలాగే, బాధితురాలు పోలీసులకు సైతం ఫిర్యాదు చేసింది.

జాతరలో దొంగల చేతివాటం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద జరుగుతున్న జాతర ఉత్సవాల్లో మంగళవారం రాత్రి జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. జాతర ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో రద్దీ నెలకొంది. దీంతో ఇదే అదునుగా గుర్తు తెలియని దుండగులు భక్తుల వద్ద నుంచి నగదు అపహరించగా, బాధితులు లబోదిబోమంటున్నారు. జాతర ఉత్సవాలకు వచ్చిన ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలానికి చెందిన ఓ వ్యక్తి జేబు నుంచి రూ.7 వేల నగదు, కుక్కునూరు మండలం బెస్తాగూడేనికి చెందిన మహిళ హ్యాండ్ బ్యాగులో ఉన్న రూ.8 వేలు, ఇదే గ్రామానికి చెందిన వృద్ధుడి వద్ద రూ.1500, జీలుగుమిల్లి మండలానికి చెందిన మరో ఇద్దరి వద్ద రూ.6 వేలు చొప్పున అపహరించారు. కొద్ది సేపటి తర్వాత బాధితులు తమ వద్ద ఉన్న నగదు చోరీకి గురైనట్లు గుర్తించి జాతర ఉత్సవాల్లో విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గస్తీ పెంచారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



బాలాజీ (ఫైల్)

టేకులపల్లి: వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని బోడు జీపీ లాక్యాతండాకు చెందిన ధరావత్ బాలాజీ (48)కి మూడు రోజుల కిందట వడదెబ్బ తగిలింది. మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య విజయ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..



బక్కయ్య (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని కొత్తగూడెంకు చెందిన జంగాల బక్కయ్య(65) వడదెబ్బకు గురై మంగళవారం మృతి చెందాడు. ఈనెల 6, 7వ తేదీల్లో వ్యవసాయ పనులకు వెళ్లిన ఆయన వడదెబ్బకు గురయ్యాడు. దీంతో చికిత్స చేయిస్తుండగా కన్నుమూశాడు. ఆయన భార్య సైదమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

బైక్ పల్టీ.. బాలుడు...



శ్రీకాంత్ (ఫైల్)

చర్ల: మండలంలోని రాళ్లగూడెం (పర్ణశాల) మూలమలుపులో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిన ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరానికి చెందిన బాలుడు కవ్వాల శ్రీకాంత్ (16), జంగిటి మున్నా దుమ్ముగూడెం వైపు నుంచి పర్ణశాల ఆలయానికి వచ్చారు. అక్కడి నుంచి చర్ల వైపునకు వస్తుండగా రాళ్లగూడెంలోని మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడింది. వెనుక కూర్చున్న కవ్వాల శ్రీకాంత్ తలకు బలమైన గాయాలవగా అంబులెన్సులో భద్రాచలం తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి సోదరుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నర్సిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న కలప

మణుగూరుటౌన్: మణుగూరు రైల్వేస్టేషన్ వెనుక వైపు నుంచి తరలిస్తున్న కలపను అటవీశాఖ అధికారులు మంగళవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. అటవీ రేంజ్ అధికారి ద్వాలియా కథనం ప్రకారం.. మణుగూరు రైల్వేస్టేషన్ వెనుక వైపు నుంచి అశ్వాపురం మండలానికి వెళ్లే దారిలో ఇటుక బట్టీలకు కొందరు కలప తరలిస్తుండగా బీట్ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లారు. అటవీ అధికారులను చూసిన దుండగులు కలపను అక్కడే వదిలేసి పారిపోయారు. కలపను స్వాధీనం చేసుకుని, స్థానిక అటవీశాఖ కార్యాలయానికి తరలించామని రేంజ్ అధికారి తెలిపారు. కలప విలువ రూ.20 వేలు ఉంటుందన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



కాలిబూడిదైన పూరిల్లు

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని ఆసుపాకకాలనీకి చెందిన కట్టం రాముడు ఉదయం పశువులను కాసేందుకు వెళ్లాడు. ఇంట్లో భార్య రమాదేవి చంటిబిడ్డతో ఉంది. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా ఇంట్లో విద్యుత్ వైర్లు కాలి మంటలు వ్యాపించడంతో గమనించిన రమాదేవి భయంతో చంటిబిడ్డతో సహా బయటకు పరుగులు తీసింది. క్షణాల్లోనే మంటలు వ్యాప్తి చెంది ఇంట్లో ఉన్న కూలర్, ఫ్రిజ్, టీవీతోపాటు రూ.20 వేలు నగదు కూడా కాలిపోయింది. సమీపంలోని ఇళ్లకు మంటలు అంటుకోకుండా స్థానికులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకునేలోగానే అంతా అగ్నికి ఆహుతైంది.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి వ్యక్తి మృతి

రంజాన్‌కు ముందు ప్రమాదంతో విషాదం



షేక్ ఖాసీం (ఫైల్)

పెనుబల్లి: ద్విచక్రవాహనం పైనుంచి అదుపుతప్పి పడిపోయి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెనుబల్లి మండల పరిధిలోని నీలాద్రి అటవీప్రాంతంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం బూర్గుడెం గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ షేక్ ఖాసీం అలియాస్ హబీబ్ (38) తన ద్విచక్రవాహనంపై అదే గ్రామానికి చెందిన ఇర్ఫాన్‌తో కలిసి నీలాద్రి మీదుగా సత్తుపల్లి వెళ్తున్నాడు. మార్గమధ్యలో నీలాద్రి అటవీప్రాంతంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న ఖాసీంకు తీవ్ర గాయాలు కాగా, ఇర్ఫాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఆ మార్గంలో వెళ్తున్న ప్రయాణికులు వారిని కొత్తగూడెం తరలిస్తుండగానే మార్గమధ్యలో ఖాసీం మృతి చెందాడు. ఇంతలోనే బంధువులు చేరుకుని ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. కాగా, విషయం తెలుసుకున్న వీఎం బంజర్ పోలీసులు బూర్గుడెం వెళ్లి వివరాలు ఆరా తీయడంతో పాటు మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించాలని బంధువులకు నచ్చచెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.వెంకటేశ్ తెలిపారు. కాగా, గురువారం రంజాన్ పండుగ ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమవుతుండగా.. ఖాసీం మృతి చెందగా ఆయన కుటుంబంతో పాటు బూర్గుడెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఎత్తిపోతలు ఎప్పుడో..?

- ప్రారంభానికి నోచుకోని లిఫ్ట్ ఇరిగేషన్
- రూ.9కోట్లు వెచ్చించినా ఫలితం శూన్యం



తుమ్మలకుంట శివారులోని తిమ్మంపేట ఎత్తిపోతల పథకం



పిచ్చి మొక్కలు, పొదలతో అల్లుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్

ములకలపల్లి: గిరిజన రైతులకు సాగు నీరందించేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకం ప్రారంభానికి నోచుకోలేదు. రూ.9 కోట్లతో కట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా, అన్నదాతకు అందుబాటులోకి రాకపోవడంతో నిరుపయోగంగా మారింది. మండలంలోని తుమ్మలకుంట గ్రామ శివారులో 2015 – 16లో టీఎస్‌పీ నిధులు రూ.8.94 కోట్లతో తిమ్మంపేట ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. నీటిపారుదల అభివృద్ధి సంస్థ (టీఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో 884 ఎకరాలకు నీరందించడమే లక్ష్యంగా పాములేరు వాగు వద్ద దీనిని కట్టారు. ఒక్కోటి 200 హెచ్‌పీ సామర్థ్యం గల రెండు మోటార్లను ఏర్పాటు చేసి, వాగుకు అనుసంధానించారు. వీటికి విద్యుత్ సరఫరా నిమిత్తం ములకలపల్లి సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేకంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. పథకంలో భాగంగా, పంట పొలాలకు ప్రత్యేకంగా పైపులైన్లు వేసి, 12 నీటి తొట్లు (డీసీ)లు నిర్మించారు. దీంతో ఇక చేలకు నీటి కొరత ఉండదని ఆయకట్టు రైతులు ఆనందపడ్డారు. కానీ, వారి ఆశ తీరలేదు.

మూడేళ్లయినా..

2020లో ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి కాగా మూడేళ్ల గడుస్తున్నా లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేదు. ఈనాటికి దీనిని అధికారికరంగా ప్రారంభించి, రైతులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలే చేయకపోవడం ఒకింత విస్మయానికి గురిచేస్తోంది. 2021లో దీనిని ఇరిగేషన్ శాఖకు బదిలీ చేశారు. తర్వాత ట్రయల్ రన్ వేసి, క్షుణ్ణంగా పరిశీలించారు. ఇక స్థానిక కమిటీని వేసి, స్కీంను స్వాధీన పరచాల్సి ఉంటుంది. కమిటీ ఆధ్వర్యంలో పథకాన్ని నిర్వహించాల్సి ఉంటుంది. మేజర్ రిపేర్లు, సాంకేతిక పరమైన సమస్యలను ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షిస్తారు. కానీ, ఇప్పటికీ కమిటీ ఎంపిక పూర్తికాలేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రస్తుతం ఈ ప్రదేశమంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన భారీ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నిలువెత్తు పొదలు అల్లుకుపోయాయి. ఆ ప్రాంతమంతా అడవిని తలపిస్తోంది. అధికారులు దృష్టి సారించి, వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ఇకనైనా ప్రారంభించాలి..



వ్యవసాయ భూములకు నీళ్లు అందుతాయనే ఆశ అడియాసగానే మిగులుతోంది. ఏళ్లుగా ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా ఉంటోంది. త్వరితగతిన వినియోగంలోకి తెస్తే రెండు పంటలు పండించుకుంటాం.

– తుర్రం శ్రీను, ఆయకట్టు రైతు

వర్షాకాలంలో ప్రారంభిస్తాం



వేసవి కాలం కాబట్టి వాగులో నీటి ప్రవాహం బాగా తక్కువగా ఉంది. రానున్న వర్షాకాలంలో మోటార్లకు సరిపడా నీళ్లురాగానే ప్రారంభిస్తాం. లిఫ్ట్ నిర్వహణ కమిటీ ఏర్పాటు చేసి, వారికి అప్పగించే చర్యలు చేపట్టాం.

– వెంకటరామన్, ఏఈఈ, ఇరిగేషన్ శాఖ

భూమి బలం తెలుసుకుందాం...

- మట్టి పరీక్షలతో వెల్లడి కానున్న ఫలితాలు
- ఆపై అవసరమైన మేర ఎరువులు వాడితే మేలు
- పరీక్షలకు ఇదే అనువైన సమయం అంటున్న అధికారులు
- గ్రామాల్లో రైతులకు విస్తృతంగా అవగాహన



మట్టి సేకరణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

కామేపల్లి: పంటలు సాగు చేసే రైతులు మేలైన దిగుబడి సాధించాలంటే భూమి సారవంతంగా ఉండాలి. అయితే, ఏ భూమిలో ఎంత మేరకు పోషకాలు ఉన్నాయనే విషయం భూసార పరీక్షలతోనే తేలిపోతుంది. ప్రస్తుత సమయంలో భూములు ఖాళీగా ఉన్నందన భూసార పరీక్షలకు ఇదే సరైన సమయమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ మట్టి నమూనాల సేకరణ, పరీక్షల ఆవశ్యకతను వివరిస్తున్నారు.

అవగాహన లేక...

నేలలో అనేక పోషకాలు ఉంటాయి. కానీ పంటల దిగుబడి కోసం వ్యాపారులపైనే ఆధారపడుతున్న పలువురు రైతులు అదనంగా సేంద్రియ, రసాయనిక ఎరువులను వాడుతున్నారు. తద్వారా సాగు ఖర్చు పెరగడమే కాక నేల తన సహజ స్వభావాన్ని కోల్పోతోంది. ఇలా జరగొద్దంటే ప్రతీ రైతు రెండు, మూడేళ్లకోసారి భూసారాన్ని తెలుసుకోవాలని.. తద్వారా అవసరమైన ఎరువులు వాడితే ఫలితం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమిలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలిసిపోతుంది. సమస్యాత్మకమైన భూములు ఉంటే.. వాటిని సవరించుకునే విధానాలు తెలుసుకోవచ్చు.

నమూనా సేకరణ ఇలా..

పొలంలో 'వీ' ఆకారంలో 15 సెం.మీ. మేర పారతో గుంట తీసి.. అందులో పైపొర నుంచి కింది వరకు ఓ పక్కగా మట్టి సేకరించాలి. ఇలా ఎకరా విస్తీర్ణంలో 8 నుంచి 10 చోట్ల మట్టి సేకరించి అంతా కలిపి నాలుగు భాగాలు చేయాలి. అందులో ఎదుటి భాగాలను తీసుకుని, మిగతా మట్టి తీసేస్తూ అర కిలో వచ్చే వరకు చేయాలి. అందులో రాళ్లు, పంట వేర్ల మొదళ్లు లేకుండా చూసి బాగా ఆరబెడితే పరీక్ష చేయించుకోవచ్చు. కాగా, మట్టి తీసుకెళ్లేందుకు ఎరువుల సంచులు ఉపయోగించొద్దు. అలాగే, సేకరణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

రైతులు నిరాసక్తత

భూసార పరీక్ష మాత్రమే కాకుండా నీటి పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అయితే రైతులు భూసార పరీక్షలపై అంతగా మొగ్గు చూపడం లేదని తెలుస్తోంది. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు మట్టి నమూనాలు 465, నీటి పరీక్షలకు సంబంధించి 176 నమూనాలే అందాయని అధికారులు చెబుతున్నారు. ఇకనైనా అదనపు ఖర్చు తగ్గించుకుని భూమిని కాపాడుకునేందుకు భూసార పరీక్ష తప్పక చేయించుకోవాలని సూచిస్తున్నారు.

ఇప్పుడైతేనే మేలు...



భూసార పరీక్షలకు ఇది అనుకూల సమయం. రైతులు తమ పొలాల్లో మట్టిని ల్యాబ్‌కు పంపిస్తే రెండు, మూడు రోజుల్లోనే ఫలితాలు వస్తాయి. తద్వారా రైతులు తమ భూముల్లోని పోషక విలువలు తెలుసుకోవచ్చు. ఆపై అవసరమున్నంత మేర ఎరువులనే ఉపయోగిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– భూక్యా తారాదేవి, ఏఓ, కామేపల్లి

మేలు జరుగుతుందని చెప్పారు..



భూసార పరీక్షలతో మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయాధికారులు చెప్పారు. పరీక్షల కోసం మట్టి ఎలా సేకరించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా సూచించారు. అధికారులు చెప్పినట్లు పరీక్ష చేయించి ఫలితాల ప్రకారం పంటల సాగు, ఎరువులు వాడకంలో మెళకువలు పాటిస్తాం.

– వల్లభనేని అశోక్, రైతు, పాసేకల్

ఉగాది వేడుకల్లో ఏపీ సీఎం వైఎస్ జగన్ దంపతులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతి మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నిర్వహించిన ఉగాది పూజా కార్యక్రమాల్లో సీఎం జగన్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని వేద పండితులు ఆశీర్వదించారు. తీర్థప్రసాదాలు, ఉగాది పచ్చడిని అందజేయగా సీఎం జగన్ దంపతులు స్వీకరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ మంచి జరగాలని సీఎం జగన్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. 'రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు. శ్రీ క్రోధి నామ సంవత్సరంలో నా అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలు, విద్యార్థులు అందరికీ మంచి జరిగి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను' అంటూ ట్వీట్ చేశారు.


పల్నాడు జిల్లా గంటావారిపాలెంలో జరిగిన ఉగాది వేడుకలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతికి ఆశీర్వచనం అందజేస్తున్న వేద పండితులు


తన సతీమణి వైఎస్ భారతీ రెడ్డి నుదుటిన బొట్టు పెడుతున్న సీఎం జగన్

అయ్యో వైష్ణవి

- మూడేళ్ల వయసులో తల్లి వదిలేసింది
- రెండేళ్ల క్రితం తండ్రి ఆత్మహత్య
- ఇప్పుడు ఆ బాలిక బలవన్మరణం
- దుండిగల్ స్ఫూర్తి ఫౌండేషన్‌లో ఘటన


వైష్ణవి (ఫైల్)

దుండిగల్: మూడేళ్ల వయస్సు ఉన్నప్పుడే తల్లి వదిలేసి వెళ్లిపోయింది.. రెండేళ్ల క్రితం తండ్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పదకొండేళ్ల వయస్సులోనే ఈ రెండు ఘటనలు ఆ బాలికను కలచివేశాయి. అయినాసరే తట్టుకుని చదువుతోంది.. కానీ ఇప్పుడు అర్ధంతరంగా ఏమైందో ఏమో అనుమానాస్పద స్థితిలో అనాథాశ్రమంలో బలవన్మరణానికి పాల్పడింది. సూరారం ప్రాంతానికి చెందిన దివంగత నీలం సతీశ్ కుమార్తె వైష్ణవి(11) దుండిగల్‌లోని స్ఫూర్తి ఫౌండేషన్‌లో ఆరవ తరగతి చదువుతూ అక్కడే ఉంటోంది. వదిన పెళ్లి ఉండటంతో ఈ నెల 3న ఇంటికి వెళ్లిన వైష్ణవి అక్కడ బంధువులతో సంతోషంగా గడిపింది. 8న తిరిగి ఫౌండేషన్‌కు వచ్చింది. ఉదయం తోటి స్నేహితులతో కలిసి ఆనందంగా ఆటలు ఆడింది. అదే రోజు మధ్యాహ్నం తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వైష్ణవి ఉరి వేసుకున్న గదిలోనే గతేడాది మరో బాలిక ఇదే విధంగా ఆత్మహత్యకు పాల్పడటంపై మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి వచ్చినప్పుడు సంతోషంగా ఉందని, 8వ తేదీ మధ్యాహ్నం వరకు స్నేహితులతో ఆటలు ఆడిందని, ఇంతలోనే ఆత్మహత్య చేసుకోవడం వెనుక తమకు అనుమానాలు ఉన్నాయని అంటున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా సమగ్ర దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

'టెట్' దరఖాస్తు గడువు పెంపు!

▶ మొదటి పేజీ తరువాయి

దరఖాస్తులొచ్చాయి. ఈ మధ్య కాలంలో బీఈడీ చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అయినప్పటికీ పదోన్నతుల కోసం సర్వీస్ టీచర్లు కూడా టెట్ రాయాలన్న నిబంధన ఉండటంతో ఈసారి 3 లక్షల అప్లికేషన్లు వస్తాయని అధికారులు అంచనా వేశారు.

ఎన్‌సీటీఈ నుంచి సమాధానం వస్తేనే స్పష్టత..: 80 వేల మంది టీచర్లు టెట్ అర్హత కోసం దరఖాస్తు చేయాల్సి ఉండగా వారు ముందుకు రాలేదు. సెకండరీ గ్రేడ్ నుంచి స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్‌కు టెట్ అవసరం. కానీ ఎస్జీటీగా ఉన్న వ్యక్తి ప్రాథమిక స్కూల్ హెచ్ఎంగా వెళితే, అది సమాన హోదాగా టీచర్లు చెబుతున్నారు. మరోవైపు స్కూల్ అసిస్టెంట్లు ప్రాథమిక, ఉన్నత పాఠశాల హెచ్ఎంగా వెళ్ళినా హోదాలో మార్పు ఉండదనే వాదన టీచర్లు లేవనెత్తారు. అలాంటప్పుడు టెట్‌తో అవసరం ఏమిటనే దానిపై ఉపాధ్యాయ సంఘాలు స్పష్టత కోరాయి. ఈ నేపథ్యంలో పాఠశాల విద్య అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ)కి లేఖ రాశారు. ఒకటి రెండు రోజుల్లో దీనికి సమాధానం వస్తుందని ఆశిస్తున్నారు.

పరీక్ష తేదీల్లో మార్పులు ఉండవు..: కేవలం దరఖాస్తు చేసుకోవడానికి, ఆన్‌లైన్ ఫీజు చెల్లింపుకు మాత్రమే గడువు పెంచే ఆలోచనలో ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అంతే తప్ప పరీక్ష తేదీల్లో మార్పు ఉండదని స్పష్టం చేస్తున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం టెట్ పరీక్ష మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకూ జరుగుతుంది. ఫలితాలను జూన్ 12న వెల్లడిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారు డీఎస్సీ రాసేందుకు వీలుగా ఆ పరీక్ష గడువునూ పెంచారు.

డీఎస్సీకి అంతే.. పెద్దగా దరఖాస్తుల్లేవ్ ..: డీఎస్సీ జూలై 17 నుంచి 31వ తేదీ వరకూ జరుగుతుంది. అయితే డీఎస్సీకి కూడా ఇప్పటి వరకూ పెద్దగా దరఖాస్తులు రాలేదు. పోస్టులు పెరిగినా కొత్తగా వచ్చిన దరఖాస్తులు తక్కువగానే ఉన్నాయి. రాష్ట్రంలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి సర్కారు డీఎస్సీని ప్రకటించింది. దీనికి కొత్తగా వచ్చిన దరఖాస్తులు 37,700. గతేడాది 5,089 పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ కోసం 1.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరు మళ్ళీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు.

గడువు పెంచాల్సిందే

టెట్ అప్లికేషన్స్ గడువు పెంచి ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలి. ఉగాది, రంజాన్ సెలవుల కారణంగా రాష్ట్రంలో మీ సేవ సెంటర్లు అందుబాటులో ఉండటం లేదు. మొబైల్‌లో టెట్ దరఖాస్తులు పూర్తి చేయడం ఇబ్బందిగా ఉంది.

– రావుల మనోహర్ రెడ్డి (డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)

జూన్ వరకు నీటి సమస్య రాదు

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులను నియమించిన విషయాన్ని గుర్తు చేసింది.

ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందన..: తాగునీటి సమస్య ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చినా, వార్తలు వచ్చినా వెంటనే అధికార యంత్రాంగం స్పందిస్తోందని ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో మొత్తం 143 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఉంటే.. అందులో 130 మునిసిపాలిటీల్లో సాధారణ రోజులతో పోలిస్తే పదిశాతం మేరకు నీటి కొరత ఉన్నా.. ప్రజలకు సరిపడే తాగునీటి సరఫరా జరుగుతోందని వివరించింది. సాధారణ రోజుల్లో ఈ పట్టణాల్లో సగటున 1398.05 ఎల్ఎండీ(మిలియన్స్‌లీటర్స్ పర్ డే) తాటి సరఫరా జరిగితే ప్రస్తుతం 1371 ఎల్ఎండీల నీటి సరఫరా జరుగుతోందని, 26.31 ఎల్ఎండీల కొరత ఏర్పడిందని స్పష్టం చేసింది. పది మునిసిపాలిటీలతోపాటు, రెండు కార్పొరేషన్లలో అధికంగా నీటి ఎద్దడి ఉన్నట్లు గుర్తించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఖమ్మం, కరీంనగర్‌లో ప్రత్యామ్నాయ చర్యలు..: ఖమ్మం, కరీంనగర్‌లో ఎండలు ముదిరే కొద్ది నీటి ఎద్దడి పెరుగుతుందన్న అంచనాతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. 27 పట్టణాల్లో 135 ఎల్ పీసీడీ(లీటర్స్ పర్ పర్సన్ పర్‌డే) కంటే ఎక్కువ నీటి సరఫరా జరుగుతుంటే, 48 పట్టణాల్లో 100 నుంచి 135 ఎల్‌పీసీడీల మధ్య, 67 మునిసిపాలిటీల్లో 100 ఎల్‌పీసీడీ కంటే తక్కువ సరఫరా జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో 23,839 ఆవాసాలకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, గ్రామాల్లో నీటి ఎద్దడి లేదని భగీరథ అధికారవర్గాలు చెబుతున్నాయి.

నీటి మట్టాలు తగ్గడం వల్లనే ఎద్దడి..: గడిచిన అక్టోబర్ నుంచి వర్షాలు లేకపోవడం, గోదావరి, కృష్ణా రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గడం వల్ల తాగునీటి సమస్య ఉత్పన్నం అయినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

అందుబాటులో గ్రిడ్, స్టాండ్ బై పంపులు

మంచినీటి సమస్య ఎక్కడైనా తలెత్తితే గ్రిడ్ పంప్‌లతో పాటు, స్టాండ్‌బై పంపులు అందుబాటులో ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా స్థాయిలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు జిల్లా కలెక్టర్లకు మొత్తం రూ. 100 కోట్లు నిధులు విడుదల చేసినట్లు తెలిపింది. నాగార్జునసాగర్ నుంచి పాలేరు, ఉదయ సముద్రం రిజర్వాయర్‌ల నుంచి నల్లొండ, ఖమ్మం పట్టణాలకు నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేట్టింది. మిడ్ మానేర్, లోయర్ మానేరు నుంచి కరీంనగర్ నగరానికి నీటిని అందించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. అవసరమైతే కర్ణాటకలోని నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి కొంత నీటిని విడుదల చేయాలంటూ అక్కడి ప్రభుత్వాన్ని కోరాలని ఇరిగేషన్ విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంది. నారాయణపూర్ నుంచి జూరాల రిజర్వాయర్‌కు వచ్చే నీటితో గద్వాల మిషన్ భగీరథకు తాగునీటి సరఫరా చేసుకోవచ్చని భావిస్తున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు 131 పట్టణాల్లో 294 ప్రభుత్వ ట్యాంకర్లతో పాటు 97 ట్యాంకర్లను అద్దెకు తీసుకుని, అత్యవసరమైతే ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

నేను బాధితురాలిని

కోర్టులో ప్రస్తావించేందుకు రాసుకొచ్చిన 4 పేజీల లేఖలో కవిత

సాక్షి, న్యూఢిల్లీ: 'నా హక్కులకు భంగం కలగకుండా, ఈ కేసులో పేర్కొన్న విషయాల్లో నాకు ఎలాంటి ప్రమేయం లేదా ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేదని చెప్పాలనుకుంటున్నా. రెండున్నరేళ్లుగా ఈడీ/సీబీఐ దర్యాప్తు ముగింపు లేని దర్యాప్తుగా సాగడం ప్రపంచమంతా చూస్తోంది. ఈ విషయంలో మహిళా రాజకీయ నాయకురాలిగా ఇతరులకన్నా ఎక్కువ బాధితురాలిని నేనే. ఈ కేసు నా వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసింది. నా వ్యక్తిగత ఫోన్ నంబర్ అన్ని టీవీల్లో ప్రసారం చేయడం నా గోప్యతకు భంగం కలిగిస్తోంది. నేను దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరించాను. వారి ముందు నాలుగుసార్లు హాజరయ్యాను. నాకు తెలిసినంత వరకూ వారికి సమాధానమిచ్చాను. నా బ్యాంకు, వ్యాపార వివరాలు తెలియజేశాను. నా ఫోన్లు దర్యాప్తు సంస్థకు ఇచ్చి పూర్తిగా సహకరించినా వాటిని ధ్వంసం చేశానని నిందిస్తున్నారు. రెండున్నరేళ్లలో దర్యాప్తు సంస్థలు అనేక మంది విషయంలో పలుసార్లు దాడులకు పాల్పడటంతోపాటు మానసికంగా, శారీరకంగా వేధించి, బెదిరించి అరెస్టు చేశాయి. అయినప్పటికీ తమ ప్రకటనలను, రాజకీయ పొత్తులను మారుస్తూ వచ్చిన వారి నుంచి కొన్ని స్టేట్‌మెంట్లు సేకరించాయి. ఈ కేసు మొత్తం వాంగ్మూలాల మీదే ఆధారపడి ఉంది. కేసులో డబ్బు లావాదేవీలు ఎక్కడా లేవని... అవినీతికి సంబంధించిన ఆధారాలు లేవనడాన్ని తోసిపుచ్చలేమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. సాక్షుల్ని తారుమారు చేశారని ఈడీ ఆరోపిస్తోంది. మా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నన్నెందుకు అరెస్టు చేయలేదు. రెండున్నరేళ్ల దర్యాప్తు విఫలమైన తర్వాత సార్వత్రిక ఎన్నికలకు ముందు కేవలం స్టేట్‌మెంట్ల ఆధారంగా ఎలాంటి ఆధారాలు లేకుండా మార్చి 15న ఈడీ అరెస్టు చేసింది. నాపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ అరెస్టు చేసింది. ప్రస్తుతం ఈడీ/సీబీఐ కేసుల్లో 95 శాతం ప్రతిపక్షాలపైనే ఉన్నాయి. నిందితులు బీజేపీలో చేరితే దర్యాప్తు ఆకస్మికంగా నిలిచిపోతోంది. నోరుమెదపకండి లేకపోతే ఈడీని పంపుతామని బీజేపీ నాయకులు పార్లమెంటు వేదికగానే బెదిరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీలు ఏదైనా ఉపశమనం లభిస్తుందని న్యాయస్థానాలు వైపు చూస్తున్నాయి. నేను ఈడీ ప్రక్రియ విధానాలకు సహకరించడం తప్ప ఏమీ చేయలేను. ఆ విధంగానే కొనసాగుతున్నాను. అందుకే నాకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతున్నా. నా జీవితంలో ముఖ్యమైన విషయం ఏంటంటే బాధ్యాతయుతమైన తల్లిగా ఉండాలని కోరుకుంటున్నాను. నేను చాలా అర్హతలు కలిగిన వ్యక్తిని. అందుకే కుమారుడు బోర్డు పరీక్షలు, ఆప్టిట్యూడ్ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు నా పాత్ర ఏమిటో అర్థం చేసుకున్నాను. నేను ప్రపంచానికి దూరంగా ఉండే వ్యక్తిని కాదు. నేనేమీ ఒకే సంతానం కలిగిన తల్లిని కాదు. తల్లి స్థానాన్ని భర్తీ చేయగలమా? చదువు విషయంలో నా కుమారుడుకి ఇది చాలా క్లిష్టమైన సంవత్సరం. నేను గైర్హాజరు కావడం కుమారుడిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని భయపడుతున్నా. అందుకే నా బెయిల్ అభ్యర్థన పరిశీలించాలని మళ్లీ కోరుతున్నా' అని కోర్టులో స్వయంగా ప్రస్తావించేందుకు రాసుకొచ్చిన 4 పేజీల లేఖలో కవిత పేర్కొన్నారు. అయితే ముందుగా దరఖాస్తు చేసుకోనందున కోర్టు అనుతించకపోవడంతో ఆ లేఖను మీడియాకు విడుదల చేశారు.

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

▶ మొదటి పేజీ తరువాయి

కవితను బెయిల్‌పై విడుదల చేస్తే సాక్ష్యాలు తారుమారయ్యే అవకాశం ఉందన్నారు. చార్జిషీటులో కవిత పాత్రపై స్పష్టత ఇవ్వడానికి మరో 14 రోజుల గడువు కావాలని కోరారు. అయితే కస్టడీ పొడిగింపు ద్వారా ఈడీ తెలుసుకోవాల్సిన విషయాలేవీ లేవని కవిత తరఫు న్యాయవాది నితీష్ రాణా వాదించారు. ఈ కేసులో రెండేళ్లుగా దర్యాప్తు కొనసాగుతున్నా ఈడీ అధారాలేవీ చూపలేదన్నారు. కవితకు స్వయంగా మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరారు. కానీ అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. నిందితులకు నేరుగా మాట్లాడే హక్కు ఉందని కవిత న్యాయవాది తెలపగా అందుకోసం దరఖాస్తు చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు. వాదనల అనంతరం కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 23 వరకు పొడిగిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కోర్టు అనుమతితో కవితను ఆమె భర్త, మామ కలిసి కాసేపు మాట్లాడారు.

జిల్లా వార్తలు

మంత్రి తుమ్మలకు ఆశీర్వచనం


తుమ్మలను ఆశీర్వదిస్తున్న అర్చకులు

దమ్మపేట: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దంపతులను వేద పండితులు ఆశీర్వదించారు. మంత్రి స్వగ్రామమైన దమ్మపేట మండలం గండుగులపల్లిలో మంగళవారం భద్రాచలం రామాలయ అర్చకులు, వేదపండితులు తుమ్మలను కలిశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి దంపతులను దీవించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి ఆలయ విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి జగన్నాథాచార్యులు, ముఖ్య అర్చకులు రామభద్రాచార్యులు, శేషు తదితరులు పాల్గొన్నారు.

లేత దశలోనే దిగుబడి !

- మంత్రి తుమ్మల తోటలో కోతకు వచ్చిన ఆయిల్‌పామ్


ఆయిల్‌పామ్ గెలతో ఎమ్మెల్యే జారే, తుమ్మల యుగంధర్

దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంట లేత దశలోనే కాపుకు వచ్చింది. మంత్రి స్వగ్రామమైన దమ్మపేట మండలం గండుగులపల్లిలో ఉన్న పదహారు ఎకరాల భూమిలో వరి పొలాన్ని చదును చేసి ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఇందులో అంతర పంటలుగా మల్చింగ్ పద్ధతిలో పుచ్చకాయ, కూరగాయలు సాగు చేశారు. దీంతో ఆయిల్‌పామ్ మొక్కలకు సరైన పోషకాలు సమృద్ధిగా అందడంతో... 36 నెలలకు రావాల్సిన కాపు 27వ నెలలోనే వచ్చింది. సుమారు ఎకరాకు పైగా మొక్కలకు మూడు టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకావముందని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ తెలిపారు. ఈమేరకు మంగళవారం గెలల కోతను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సన్న ధాన్యానికి భలే గిరాకీ!

రకాల ఆధారంగా క్వింటాకు రూ.3వేల ధర

- కల్లాలపై పచ్చి ధాన్యాన్నే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- మద్దతు ధర కంటే ఎక్కువ వస్తుండడంతో రైతులకు మేలు
- ధర పెరిగినప్పుడు అమ్ముకోవాలనే యోచనలో వ్యాపారవర్గాలు


తిరుమలాయపాలెం మండలం బీరోలులో ధాన్యం కాంటా పెడుతున్న హమాలీలు

ఖమ్మంవ్యవసాయం: సన్న రకాల ధాన్యానికి డిమాండ్ పెరిగింది. మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ఎక్కువతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు, ఇతర కారణాలతో బియ్యానికి డిమాండ్ పెరగడంతో ఈ ఏడాది ధాన్యం ధర సైతం పెరిగిందని తెలుస్తోంది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం గ్రేడ్ 'ఏ' ధాన్యం క్వింటాకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183గా మద్దతు ధర నిర్ణయించింది. ఇందులో గ్రేడ్ 'ఏ' రకానికి డిమాండ్ ఉండగా.. పచ్చి ధాన్యానికే వ్యాపారులు రూ. 2,250 నుంచి రూ.3వేల వరకు వ్యాపారులు చెల్లిస్తున్నారు. ఓపక్క ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినా.. ధర ఎక్కువగా వస్తుండడం, కల్లాల మీదే వ్యాపారులు తీసుకుంటుండడంతో రవాణా చార్జీల భారం తగ్గుతుందనే భావనతో రైతులు మొగ్గు చూపుతున్నారు. మరోపక్క దొడ్డు రకాలను కూడా ప్రభుత్వ మద్దతు ధరకు సమాంతరంగా కొనుగోళ్లకు వ్యాపారులు ముందుకొస్తున్నారు.

1.62 లక్షల ఎకరాల్లో వరి సాగు

ఈ ఏడాది ఆశించిన స్థాయిలో నీటి సౌకర్యం లేక యాసంగిలో వరి సాగు గణనీయంగా తగ్గింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1,62,391 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఖమ్మం జిల్లాలో 1,05,333 ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 57,058 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా.. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో సన్న రకాల సాగుకే ప్రాధాన్యత ఇచ్చారు. యాసంగిలో సహజంగా తక్కువ కాల పరిమితి వరి రకాలను రైతులు సాగు చేస్తుంటారు.


వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు

గతంలో దొడ్డు రకాలు మాత్రమే తక్కువ కాలపరిమితి కలిగినవి ఉండగా, ఇప్పుడు తక్కువ రోజుల్లో చేతికొచ్చే సన్న రకాలు సైతం అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతులు డిమాండ్ ఉన్న సన్న ధాన్యం రకాల సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఈసారి యాసంగిలో నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో దిగుబడిలు ఆశాజనకంగా ఉండగా.. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చిందని చెబుతున్నారు.

రకాల ఆధారంగా డిమాండ్

వ్యాపారులు ధాన్యం రకాల ఆధారంగా ధర చెల్లిస్తున్నారు. వరి సన్న రకాలకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,203 ఉండగా.. వ్యాపారులు రూ.3వేల వరకు ధర పెడుతున్నారు. సన్న రకాలైన బీపీటీ – 5204(సాంబ మసూరి) క్వింటాకు రూ.2,300 నుంచి రూ.2, 500 వరకు, హెచ్ఎంటీ రూ.2,600 నుంచి రూ. 2,700 వరకు, చింట్లు రూ.2,800 నుంచి రూ.3వేల వరకు ధర పలుకుతోంది. ఇక ఆర్ఎన్ఆర్ – 15048, మార్టేరు –1224 వంటి రకాలను సైతం రూ.2,300 నుంచి రూ.2,600 వరకు కొనుగోలు చేస్తున్నారు.

రైతులకు మేలే...

పంట కోత కాగానే వ్యాపారులు కల్లాల వద్దకే పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ధర ఎక్కువగానే చెల్లిస్తుండగా.. కొనుగోలుతో తూకం సైతం రైతులకు కలిసొస్తుంది. అంతేకాక కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాల్సిన ఇబ్బందులు తప్పుతున్నాయి. మొత్తంగా క్వింటాకు రూ.వెయ్యి వరకు రైతులకు లాభం జరుగుతుండగా. తరుగు, ఇతర ఖర్చులు కూడా లేకపోవడంతో వ్యాపారులకు అమ్మేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు.

పచ్చివే రూ.2,700 చొప్పున విక్రయించా..



ఇరవై ఎకరాల్లో చింట్లు, హెచ్ఎంటీ రకాల వరి సాగు చేశా. చింట్లు రకం పచ్చి ధాన్యం క్వింటాకు రూ.2,700 చొప్పున మిర్యాలగూడెం మిల్లర్లు కొనుగోలు చేశారు. హెచ్ఎంటీ రకం కోత దశలో ఉండగానే వ్యాపారులు అడుగుతున్నారు. పచ్చి ధాన్యం విక్రయంతో క్వింటాకు రూ.200పైగా కలిసొస్తుంది.

–యడవల్లి రాంరెడ్డి, పాలేరు, కూసుమంచి మండలం

నిల్వ చేస్తున్న మిల్లర్లు

బియ్యానికి డిమాండ్ పెరుగుతున్న క్రమంలో మిల్లర్లు ధాన్యం నిల్వ చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులతో వరి సాగు విస్తీర్ణం తగ్గగా.. ఉత్పత్తి సైతం తగ్గింది. ఇంకోపక్క సన్న బియ్యం మార్కెట్‌లో క్వింటా రూ.6 వేల నుంచి రూ.7 వేల ధర పలుకుతోంది. అలాగే, కేంద్ర ప్రభుత్వం బియ్యం విదేశీ ఎగుమతులకు బ్రేక్ వేసింది. ఒకవేళ విదేశీ ఎగుమతులకు అనుమతిస్తే బియ్యం ధర పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితులన్నీ పరిగణనలోకి తీసుకున్న వ్యాపారులు ధాన్యం కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఇక్కడి వ్యాపారులే కాక నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం ప్రాంత మిల్లర్లు సైతం కొనుగోళ్లకు వస్తుండడం విశేషం.

మద్దతు ధరతో పోలిస్తే ఎక్కువే...



వరి సాగు తగ్గడంతో ధాన్యానికి గిరాకీ పెరగగా.. వ్యాపారులు పోటీపడి ధర చెల్లిస్తున్నారు. నేను పదెఎకరాల్లో అంకూర్ సోన రకాన్ని సాగు చేశా. పచ్చి ధాన్యాన్నే క్వింటా రూ.2,250 చొప్పున విక్రయించా. ప్రభుత్వ మద్దతు ధరతో పోలిస్తే క్వింటాకు రూ. 300 నుంచి రూ.400 వరకు అధికంగా పలికింది.

– కొప్పుల శ్రీనివాసరెడ్డి, బీరోలు, తిరుమలాయపాలెం మండలం

సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఉగాది వేడుకలు


ఉగాది వేడుకల్లో పాల్గొన్న డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు చాంబర్‌లో ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు, ఉగాది విశిష్టతను వివరించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ.. తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించడంతో సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో ప్రస్తుత ఏడాది కూడా రక్షణతో కూడిన లక్ష్యసాధనకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు డీవీఎస్ సూర్యనారాయణరాజు, ఎస్.దామోదర్ రావు, జి.జానకీరామయ్య, సీహెచ్.నవీన్‌కుమార్, జేసురత్నం, ఎస్.జగన్మోహన్‌రావు, బీజీఎస్ఎస్ఎన్ మాచరయ్య, కమలాకర్ భూషణ్, కేవీ రావు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో తగ్గుతున్న నీటిమట్టం



కిన్నెరసాని జలాశయం (ఇన్‌సెట్) నీటిమట్టం సూచిక

పాల్వంచరూరల్: తాగు, సాగు ప్రాజెక్టులకు నీరు అందించే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసానిలోని కిన్నెరసాని జలాశయంలో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. ఈ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులు కాగా, మంగళవారం 398 అడుగుల మేర నీరు ఉంది. గతేడాది ఇదే రోజున 401.70అడుగులుగా ఉండగా, ప్రస్తుతం అంత కంటే తక్కువకు పడిపోయింది. కిన్నెరసాని జలాశయం నుంచి నిత్యం 96.34 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. ఇందులో కొత్తగూడెం మున్సిపాలిటీకి 15 క్యూసెక్కులు, పాల్వంచ మున్సిపాలిటీకి 6.34 క్యూసెక్కులు, నవభారత్ కర్మాగారానికి 4, ఎన్ఎండీసీకి ఒక క్యూసెక్, కేటీపీఎస్ 5, 6, 7వ దశ కర్మాగారాలకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీనికితోడు ఎండల తీవ్రతతోనూ కొంత నీరు ఆవిరవుతోంది. కాగా, ప్రస్తుతమైతే నీటికొరత ఎదురయ్యే పరిస్థితులు లేవని అధికారులు చెబుతున్నారు.

ఖమ్మంలో నూజివీడు మామిడి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నూజివీడు ప్రాంతంలో సాగయ్యే మామిడికాయలను ఖమ్మంలో విక్రయిస్తున్నారు. ఉగాదిని పురస్కరించుకుని ఖమ్మంలోని పలు ప్రధాన సెంటర్లలో మంగళవారం వీటి అమ్మకాలు జోరుగా సాగాయి. మామిడికాయల సైజ్ ఆధారంగా కిలో రూ.100నుంచి రూ.130 వరకు చిరువ్యాపారులు అమ్మారు.

– ఖమ్మం సహకారనగర్


విక్రయాలకు సిద్ధంగా ఉన్న మామిడికాయలు